శిథిలావస్థకు 'వేదికలు'


దామెరలో నిర్మించిన రైతు వేదిక


తక్కళ్లపహాడ్‌లో ఊడిన బాత్‌రూమ్ డోర్, ధ్వంసమైన పార్కింగ్ టైల్స్

- రైతు వేదికల నిర్వహణకు నిధులు కరువు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

దామెర : పంట సాగుపై సలహాలు సూచనలు చేస్తూ రైతులను చైతన్యం పర్చేందుకు వేదికగా గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. అందులో భాగంగా మండలంలోని దామెర, ఊరుగొండ, పులుకుర్తి, తక్కళ్లపహాడ్‌లో లక్షల రూపాయలు వెచ్చించి వేదికలను నిర్మించింది. అయితే అధికారులు దామెర, ఊరుగొండ రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌కు వీలుగా పరికరాలు బిగించగా పులుకుర్తి, తక్కళ్లపహాడ్ వేదికలకు మాత్రం మంజూరు కాలేదని చేతులేత్తేశారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించాలంటే ఏఈఓలకు ఇబ్బందులు తప్పడం లేదు.


నిర్వహణకు నిధుల కొరత

గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించడంతో పాటు 2022 ఆగస్టు నెల వరకు ప్రతి రైతు వేదిక నిర్వహణ కోసం ప్రతినెలా రూ.9వేల చొప్పున నిధులు మంజూరు చేసింది. సదరు నిధులతో రైతులతో సమావేశాలు ఏర్పాటుచేసి పంట సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించేవారు. అయితే సెప్టెంబర్ 2022 నుంచి ఇప్పటి వరకు (జులై 2025) వరకు ఒక్కపైసా కూడా ప్రభుత్వం మంజూరు చేయలేదని సంబంధిత అధికారులు తెలిపారు. 34 నెలలుగా బిల్లులు రాకపోవడంతో నిర్వహణ భారంగా మారుతోందని ఏఈఓలు వాపోతున్నారు. నాలుగు రైతు వేదికల కరెంటు బిల్లు సుమారు రూ.65వేలు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. నిధులు లేక రైతు వేదికకు వచ్చే రైతులకు మంచినీటి సదుపాయం కూడా కల్పించలేకపోతున్నారు. ఏఓ కార్యాలయంలో పనిచేసేందుకు తాత్కాలికంగా ఓ వ్యక్తిని నియమించుకుని ప్రతినెలా ఏఓ వ్యక్తిగతంగా కొంత డబ్బు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఇలాంటి పరిస్థితుల్లో రైతువేదిక నిర్వహణ ఎలా సాధ్యం అవుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

నిర్మాణాల్లో నాణ్యతా లోపం

రైతు వేదికలు నిర్మాణంలో నాణ్యత లోపించిందని అప్పటి ప్రతిపక్షాలు విమర్శించాయి. మండల కేంద్రంలో నిర్మించిన వేదికలో టైల్స్ కుంగిపోయి ధ్వంసం కాగా ఊరుగొండ రైతు వేదిక పెచ్చులు ఊడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. తక్కళ్లపహాడ్‌లో పార్కింగ్ టైల్స్ పూర్తిగా కుంగిపోయి ధ్వంసమయ్యాయి. అలాగే మరుగుదొడ్డి తలుపు ధ్వంసమవడంతో పాటు అపరిశుభ్రంగా మారింది. పులుకుర్తిలో గోడలు బీటలువారుతున్నట్లు రైతులు వాపోతున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన నిర్మాణాలు నాలుగేళ్లకే శిథిలావస్థకు చేరుకోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ఊరుగొండలో పెచ్చులూడుతున్న భవనం


దామెరలో ధ్వంసమైన ఫ్లోరింగ్ టైల్స్

నిధులు మంజూరు చేయాలి

రైతు వేదికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి. శిథిలావస్థకు చేరుతున్న వేదికలపై ప్రత్యేక దృష్టి సారించి మరమ్మతులు చేయించాలి. ఇప్పటికైనా అధికార ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవతీసుకుని రైతు వేదికలకు పూర్వవైభవం తీసుకురావాలి.

– రాజ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు

ఉన్నతాధికారులకు తెలిపాం

రైతు వేదికల నిర్వహణ బిల్లు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఉన్నతాధికారులకు నివేదించాం. కనీసం విద్యుత్ బిల్లులు కూడా చెల్లించకపోవడంతో రూ.65వేల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఉన్నతాధికారులకు వివరించి మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపడుతాం.

– రాకేశ్, మండల వ్యవసాయశాఖ అధికారి

భూ భారతి దరఖాస్తులు పరిష్కరించాలి

- ఆర్డీఓ డాక్టర్ నారాయణ

దామెర : భూ భారతిలో భాగంగా స్వీకరించిన ఫిర్యాదులు, దరఖాస్తులను పరిశీలించి సమస్యలను త్వరగా పరిష్కరించాలని పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా భూ భారతి దరఖాస్తుల వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. సాదాబైనామా, సక్సేషన్, మ్యూటేషన్, నేమ్ కరక్షన్, డీఎస్ పెండింగ్ వంటి సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూ భారతిని చట్టానికి శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం లైసెన్డ్ సర్వేయర్లు ఆర్డీఓను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, డీటీ ఖురేషి, ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీఓను సన్మానిస్తున్న సర్వేయర్లు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి


దామెర : పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న రవిబాబు


కమలాపూర్ : కూలిపోయిన పాఠశాల ప్రహరీని పరిశీలిస్తున్న లక్ష్మణ్ తదితరులు

- డీఎల్పీఓ రవిబాబు

దామెర : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పరకాల డివిజనల్ పంచాయతీ అధికారి రవిబాబు ప్రజలకు సూచించారు. మండలంలోని ఒగ్లాపూర్‌లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను, డ్రై డేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇళ్ల చుట్టుపక్కల చెత్తాచెదారం ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఖాళీ డబ్బాలు, టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. తడి, పొడి చెత్తను ఎప్పటికప్పుడు వేరు చేసి గ్రామ పంచాయతీ వాహనాల్లో వేసి, డంపింగ్ యార్డుకు తరలించే విధంగా చర్య తీసుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నరేశ్, కారోబార్ శ్రీనివాస్, ఆశ వర్కర్ రజిత, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కమలాపూర్ : ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మణ్ సూచించారు. డ్రై డేలో భాగంగా ఎంపీడీఓ గుండె బాబుతో కలిసి శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశీలించి గోళాలు, పాత పాత్రల్లో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం టాకీస్ ఏరియాలో గల ప్రాథమిక పాఠశాలలో కూలిపోయిన ప్రహరీని పరిశీలించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన మరమ్మతులు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్ పద్మకుమారి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

క్లుప్తంగా

బీటీ రోడ్ల సాధనకు జేఏసీ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

ఐనవోలు : మండలంలోని కొండపర్తి నుంచి మూడు వైపుల రోడ్లు అధ్వాన్నంగా మారి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుండగా సాక్షి దినపత్రికలో శుక్రవారం 'అడుగుకో గుంత' కథనం ప్రచురితమైంది. దీంతో గ్రామస్తులు సమావేశమై పార్టీలకు అతీతంగా జేఏసీ ఏర్పాటు చేశారు. బీటీ రోడ్డు సాధనకు కృషిచేయాలని నిర్ణయించుకున్నారు. అప్పటికప్పుడే గ్రామస్తులతో కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా అనుముల సాంబరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కట్కూరి చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా పిట్టల శ్యాంసుందర్, కమిటీ సభ్యులుగా కోట కిరణ్, గువ్వల కృష్ణబాబును నియమించారు. రోడ్డు సమస్యలపై గలమెత్తి నిరసన, అవసరమైతే ఉద్యమం చేయడమే కమిటీ ఉద్దేశమని స్పష్టం చేశారు. వెంటనే ధ్వంసమైన రోడ్డును పరిశీలించి నిరసన తెలిపారు. సెప్టెంబర్ 1న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేయాలని, 20 ఆటోలు, 50 బైక్‌లపై గ్రామస్తులు జిల్లా కేంద్రానికి తరలివెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మాజీ సర్పంచ్ రాజమణి బెన్సన్, జిల్లా ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రాజు, ప్రభాకర్, స్వామి, రమేశ్, చిరంజీవి, సందీప్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత


రాజుకు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన ఓనపాకల రాజు తల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న రాజు స్నేహితులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.20వేల ఆర్థికసాయం అందించారు. సంతోశ్, సుమన్, రవి, మిథున్, భాస్కర్, మహేశ్, దేవేందర్, రాజేందర్, సూర్యప్రకాశ్, అంకుశావళీ, సురేందర్ ఉన్నారు.

బీజేపీ నాయకుల ఓదార్పు

మండల కేంద్రానికి చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పు రాజు తల్లి సమ్మమ్మ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు జన్నే మొగిలి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఐదుగురు దొంగల అరెస్ట్

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట ప్రాంతంలో చల్లా రఘుపతిరెడ్డి డాంబర్ ప్లాంట్‌లోని ఈ నెల 26న దొంగలు రూ.50 వేల విలువైన ఇనుప, ఎలక్ట్రికల్ సామగ్రి ఎత్తుకెళ్లారని గీసుకొండ సీఐ మహేందర్ తెలిపారు. కాగా, ఎస్సై అనిల్‌కుమార్, సిబ్బంది కలిసి శుక్రవారం గొర్రెకుంట క్రాస్‌రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో చోరీ చేసిన సామగ్రిని ట్రాలీ ఆటోలో అమ్మకానికి తీసుకెళ్తుండగా దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. పరకాలకు చెందిన పాలకుర్తి అంజలి, కేతిరి రాజు, కూరాకుల రేణుక, పాలకుర్తి పద్మ, దేవరకొండ పోచమ్మను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

హెల్పర్‌కు గాయాలు

నడికూడ : ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం నుంచి పడిన హెల్పర్‌కు గాయలయ్యాయి. ఈ సంఘటన నర్సక్కపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలం కేంద్రానికి చెందిన గోనెల వెంకటేష్ కొన్ని సంవత్సరాల నుంచి విద్యుత్ శాఖలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం నర్సక్కపల్లి గ్రామంలో విద్యుత్ స్తంభమెక్కి తీగలను సరిచేసే క్రమంలో స్తంభం విరిగి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు హనుమకొండకు తరలించారు.

నేడు ఓటరు జాబితాపై అవగాహన

నడికూడ / శాయంపేట / ఐనవోలు : రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటరు జాబితాపై అవగాహన కల్పించనున్నట్లు ఎంపీడీఓ విమల శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.
అలాగే శాయంపేట మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాయలో శనివారం ఓటరు జాబితా ప్రచురణ, పోలింగ్ కేంద్రాల ఎంపికపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఫణిచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల ఎంపికపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నేతలతో మండలస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నర్మద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు హాజరు కావాలని కోరారు.

బాధ్యతగా పనిచేస్తేనే గుర్తింపు

శాయంపేట : ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తేనే గుర్తింపు వస్తుందని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఉదయశ్రీ ప్రభాకర్ ఉద్యోగ విరమణ పొందగా మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని ఉదయశ్రీ దంపతులను శాలువాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి బాధ్యతగా పని చేసేనప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, అజీముద్దీన్, ఇటీవల ప్రధానోపాధ్యాయునిగా పదోన్నతి పొందిన కాయిత శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీహరి, సంజీవరెడ్డి, రాజిబాపురావు, ఉపాధ్యాయులు జి.పద్మ, సదానందం, సత్యప్రసాద్, రాము, రాజిరెడ్డి, వంశీధర్, కుమారస్వామి, రాజేష్‌శర్మ, సావిత్రి ఉదయశ్రీని ఘనంగా సన్మానించారు.


ఉదయశ్రీ దంపతులను శాలువాతో సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

దామెర : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాము అన్నారు. మండల కేంద్రంతో పాటు ల్యాదెళ్లలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రచారం చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ కాగితాల శంకర్, మాజీ జెడ్పీటీసీ కల్పనాకృష్ణమూర్తి, నాయకులు జాకిర్‌అలీ, కృపాకర్‌రెడ్డి, శంకర్, సంపత్ గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్ ఉన్నారు.

రాహుల్ గాంధీకి ఉద్యమకారుల ఉత్తరాలు

కమలాపూర్ : ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మోటం సంపత్ కోరారు. ఈ మేరకు ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన పోస్టు కార్డుల ఉద్యమంలో భాగంగా శుక్రవారం మండల శాఖ ఆధ్వర్యంలో ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఉత్తరాలు పంపించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ.. ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, పింఛన్లు ఇవ్వాలని, ఉద్యమకారులకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోరం నాయకులు నవీన్‌కుమార్, ప్రసాద్, శోభన్‌బాబు, రమేశ్, ఓదెలు, కొంరయ్య, వినోద్‌కుమార్, అరవింద్, ఇంద్రయ్య, సదాచారి, సదానందం పాల్గొన్నారు.


కమలాపూర్ : రాహుల్ గాంధీకి ఉత్తరాలు పంపిస్తున్న ఉద్యమకారులు

మాతృభాషను కాపాడుకోవాలి


ధర్మసాగర్ : మాట్లాడుతున్న రాజమ్మ


ఆత్మకూరు : ఒలింపిక్ జ్యోతి వెలిగిస్తున్న ప్రిన్సిపాల్ అనిత


శాయంపేట : నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మసాగర్ : మాతృభాషను కాపాడుకుంటే మన సంస్కృతిని కాపాడుకున్నట్లేనని ఉపాధ్యాయురాలు రాజమ్మ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం ధర్మ ప్రకాశ్ అధ్యక్షతన శుక్రవారం మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన ఆలోచనలు, సంస్కృతికి, తెలుగు భాష ప్రతిబింబం అన్నారు. పిల్లలకు మాతృభాషలోనే విద్య, విజ్ఞానం, సాహిత్యం, కలలు సులభంగా అర్థమవుతాయన్నారు. మాతృభాష రక్షణ, అభివృద్ధి అందరి బాధ్యతన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలోని పున్నేలు క్రాస్ వద్ద గల ఏకశిల విద్యాసంస్థలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల నుంచి రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొని విజేతలైన విద్యార్థులను ప్రిన్సిపాల్ బాబా జ్ఞాపికలు అందించి సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరకాల : తెలుగు వ్యవహారిక భాషా కోసం గిడుగు రాంమూర్తి చేసిన సేవలు మరువలేనివని పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బేతి సంతోశ్‌కుమార్ కొనియాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాంమూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని అధ్యాపకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు విభాగాధిపతి అశోక్ మోరె, అధ్యాపకులు ఈశ్వరయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రమేశ్, మహేందర్‌రావు, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ అశోక్, బీంరావు, డాక్టర్ జగదీశ్‌బాబు, సమ్మయ్య, డాక్టర్ కల్పన, డాక్టర్ పావని, రాజశ్రీ, డాక్టర్ స్వప్న, డాక్టర్ సంజయ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : గుడెప్పాడ్‌లోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్ మట్టి విగ్రహాన్ని తయారు చేసి ఒలింపిక్ జ్యోతి వెలిగించారు. అలాగే తెలుగు వ్యావహారిక భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తిలకు ఘన నివాళులర్పించారు. ఎన్‌సీసీ విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు.

శాయంపేట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దన్ మాట్లాడుతూ.. ధ్యాన్‌చంద్ సుప్రసిద్ధ భారతీయ హాకీ క్రీడాకారుడు అని కొనియాడారు. హాకీ క్రీడల్లో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో గోల్స్ చేయడంలో ప్రతిభ కనబర్చినట్లు గుర్తుచేశారు. హాకీ క్రీడల్లో భారతదేశానికి ఒలంపిక్ క్రీడల్లో వరుసగా 1928, 1932, 1936లో బంగారు పతకాలు సాధించి పెట్టారని కొనియాడారు.

పాఠశాలలో స్వచ్ఛత పాటించాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

ధర్మసాగర్ : పాఠశాలలో స్వచ్ఛమైన వాతావరణం నెలకొల్పితే విద్యార్థులు ప్రశాంతంగా చదువుకుంటారని స్వచ్ఛ విద్యాలయ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులకు స్వచ్ఛ ఈవం హరిత విద్యాలయ రేటింగ్, స్వచ్ఛ విద్యాలయ అంశాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వచ్ఛ ఈవం విద్యాలయ ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఉనికిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. హరిత విద్యాలయ రేటింగ్ ద్వారా పాఠశాలల్లో స్వచ్ఛత, పరిసరాల నిర్వహణలో ఉపాధ్యాయులు పాటించాల్సిన పద్ధతులపై వివరించారు. స్వచ్ఛతలో విద్యార్థులను భాగస్వాములను చేసి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు.

సంక్షిప్తంగా

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల అనిల్ స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశారు. ఇటీవల మరణించిన తన స్నేహితుడు ఈరాళ్ల శ్రీనివాస్ జ్ఞాపకార్థం విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను పంపిణీ చేసి తన ఉదారతను చాటుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి, ఏకేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ భూపతి శ్రీకాంత్, ప్రమోద్‌రెడ్డి, శ్రీనాథ్, అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నీరుకుళ్లలో స్కూల్ బ్యాగులు..

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో గల జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం ఎన్ఆర్ఐ పాలిశెట్టి చంద్రశేఖర్, విజయ్‌కృష్ణ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. దాతల సహకారం అభినందనీయమని పాఠశాల హెచ్ఎం నిర్మల అన్నారు.

నియామకం

ఆత్మకూరు : బీసీ ప్రజాసంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని నీరుకుళ్ల గ్రామానికి చెందిన ఉడుత రాజేందర్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నాయినిఇ భరత్ శుక్రవారం తెలిపారు. వరంగల్‌లో జరిగిన కార్యకర్తల సమావేశం అనంతరం ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు.

రోడ్డుపై నాటువేసి నిరసన

నడికూడ : మండలంలోని కౌకొండ గ్రామానికి చెందిన అఖిలపక్ష నాయకులు బురద రోడ్డుపై నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెల్లంపల్లి క్రాస్ నుంచి కౌకొండ గ్రామానికి వచ్చే 3 కిలో మీటర్ల రోడ్డు పనులను రెండుళ్లుగా పూర్తిచేయకుండా జాప్యం చేయడం సరికాదని మండిపడ్డారు. సదరు కాంట్రాక్టర్‌పై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా రోడ్డు పనుల్లో కదలిక రాలేదని ఆరోపించారు. నరేష్, నాగరాజు, తేజ్, శోభన్, రాజ్, ప్రభాస్, త్రిమూర్తి, పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు

ఎల్కతుర్తి : గణేశ్ నిమజ్జనోత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని ముల్కనూరు ఎస్సై రాజు అన్నారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరు పోలీస్‌స్టేషన్‌లో డీజే యజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వినాయక నిమజ్జన ఊరేగింపు సమయంలో డీజేలు పెట్టొద్దని, ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించినట్‌లైతే డీజేలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువులు, వాగుల వద్దకు చిన్నపిల్లలను తీసుకుపోవద్దని, నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జన వేడుకలు జరుపుకోవాలని అన్నారు. డీజే యజమానులను ముందస్తుగా బైండోవర్ చేశారు.


మాట్లాడుతున్న ఎస్సై రాజు

సస్యరక్షణ చర్యలు పాటించాలి

వ్యవసాయ అధికారి రాజేష్

ధర్మసాగర్ : వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు పొందాలని ఏఓ రాజేష్ సూచించారు. తాటికాయల గ్రామంలో జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ పంపిణీ చేసిన వరి డబ్ల్యూజీఎల్ 44, కంది డబ్ల్యూఆర్జీ 121 రకాల పంటలు శుక్రవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పంట సాగులో సమస్యలు, సందేహాలు ఉంటే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జయశ్రీ, రైతులు పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న అధికారులు